క్లుప్తంగా

'వైఎస్సార్ కంటి వెలుగు' విద్యార్థులకు వరం



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన దృశ్యం

కొత్తపల్లి: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం విద్యార్థులకు వరమని కంటి వైద్యుడు షేక్షావలి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటిఅద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు మాట్లాడుతూ ఇటీవల పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. దృష్టిలోప సమస్యలు ఉన్నట్లు గుర్తించి 9 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు.

దేశభక్తి కలిగి ఉండాలి



వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పగిడ్యాల: ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలని లైబ్రేరియన్ మద్దమ్మ, ఫిజిక్స్ టీచర్ రమణారావు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామారాజు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు గురించి విద్యార్థులకు వివరించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ముసలిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ, తాగు నీరు లేక, మధ్యాహ్న భోజనం సరిగా అమలు కాక విద్యార్థులు ఇబ్బందులు పాడాల్సి వస్తోందన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసా ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు వర్ధన్, మండల నాయకులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల విరాళం



మెడికల్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

పగిడ్యాల: శిక్షణ పొందుతున్న అండర్–17 కబడ్డీ క్రీడాకారులకు గ్రామ పెద్ద బొబ్బిటి బాబు రెడ్డి మెడికల్ కిట్లను విరాళంగా అందజేశారు. కబడ్డీ క్రీడాకారులు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్నారు. వీరి సౌకర్యార్థం రూ.10 వేల విలువ చేసే మెడికల్ కిట్ల ట్సను బాబు రెడ్డి శుక్రవారం హెచ్ఎం మధుసూదన్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మహానంది: వీఓఏల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథకం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ నరసింహులు తెలిపారు. బుక్కాపురంలోని కోదండ రామాలయం వద్ద శుక్రవారం యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించి మహానంది మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహానంది మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎస్.జయపాల్, అధ్యక్షులుగా బి.ప్రమీల, ఉపాధ్యక్షులుగా ఎస్.మహమ్మద్, కార్యదర్శిగా మహబూబ్‌బాషా, కోశాధికారిగా కిరణ్, సహాయ కార్యదర్శిగా నాగదేవి, గౌరవ సలహాదారుగా లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పలువురిని ఎన్నుకున్నారు.

22 వరకు గ్రామ సభలు

మహానంది: జాబ్‌కార్డుల వెరిఫికేషన్ కోసం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు బండిఆత్మకూరు మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ వసుధారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 20 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం బండిఆత్మకూరు, రామాపురం గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

రేపు జిల్లాకు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆదివారం నంద్యాల జిల్లాలోని గిరిజన గ్రామాల్లో పర్యటించనున్నారని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ శుక్రవారం తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు

● ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టాలని విన్నపం



సభలో వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్



సమస్యలను సభ దృష్టికి తెస్తున్న ఎంపీటీసీ సభ్యుడు చంద్రమోహన్‌నాయుడు

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎజెండాలోని అంశాల వారీగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ తాగునీటి సరఫరాపై సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరడంతో నెహ్రూనగర్ ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు ఎల్లంబావి సమీపంలో పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కొత్త పైప్‌లైన్ వేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఇటీవల గడప గడప కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే దృష్టికి స్థానిక ప్రజలు సమస్యను తెచ్చారని గుర్తు చేశారు. లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నీరు దుర్వాసన వెదజల్లుతూ ఎర్రగా వస్తున్నాయని సర్పంచ్ సుజాత సభ దృష్టికి తెచ్చారు. కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యాల బారినపడితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆమె ప్రశ్నించారు. ఎండీఎం ఆపరేటర్లు ప్రజలకు బియ్యం సరిగా పంపిణీ చేయడం లేదని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, సర్పంచ్ సుజాత అసహనం వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టాలని సభ్యులు తహసీల్దార్ భారతిని కోరారు. వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ మాట్లాడుతూ పగిడ్యాల కరువు మండలాల జాబితాలో ఉండటంతో 3,600 హెక్టార్లలో పంట నమోదు చేసి రూ. 4.26 కోట్లకు ప్రతిపాదనలు పంపామని, ఈనెల 25లోగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పుస్తకం జిరాక్స్ కాపీలను అందజేయాల్సి ఉందన్నారు. బీరవోలులో నెలకొన్న లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని త్వరలోనే పనులు చేపడతామని విద్యుత్ శాఖ ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ మద్దిలేటి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, పశువైద్యులు శ్రుతికీర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, అభివృద్ధి నివేదికలు సభలో వెల్లడించారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరమణ, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ వారికి విశేషపూజలు నిర్వహించారు.

సాధికార యాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ లాలం రమేష్

వెలుగోడు: ఈనెల 24 ఆత్మకూరులో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ లాలం రమేష్ కోరారు. సాధికార యాత్రపై శుక్రవారం జమ్మినగర్ తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రకు అన్ని గ్రామాల నుంచి అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలన్నారు. సమావేశంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మండల కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోట పెంపకం కోసం ప్రోత్సాహకాలు



మాట్లాడుతున్న ఏపీడీ బాలాజీ

మహానంది: పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు ఎన్ఆర్‌జీఎస్ ద్వారా సబ్సిడీతో అందిస్తామని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ తెలిపారు. బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామంలో శుక్రవారం జాబ్‌కార్డుల వెరిఫికేషన్‌పై ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డు తీసుకుని మృతి చెందినవారు, ఊర్లలో లేనివారు, పనులకు రానివారిని గుర్తించి వారి స్థానంలో కొత్తవారికి ఇస్తామన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మ, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పల్లకీలో కొలువుంచి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగినికి గాయాలు

ఆళ్లగడ్డ: పేరాయిపల్లె మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వార్డు సచివాలయ ఉద్యోగిని ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని 8వ వార్డు సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆదిలక్ష్మి శుక్రవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ ముగించుకుని తిరిగి భర్త నరసింహారెడ్డితో కలిసి ఆళ్లగడ్డకు బయలుదేరారు. ఈ క్రమంలో పేరాయిపల్లె మెట్ట సమీపంలో బైకు అదుపుతప్పింది. బైకుపై నుంచి కిందపడ్డ ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడటంతో స్థానిక వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు.



ఆకాశదీపాన్ని వీక్షిస్తూ వెలుగులు పంచిన చంద్రవంక

■ ఆకాశ దీపాన్ని వీక్షించిన కార్తీకచంద్రుడు

మహానంది: శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో ఆకాశదీపం ఎంతో విశిష్టత కలిగి ఉంటుంది. సకల దేవతలను ఆహ్వానిస్తూ ఆలయాల్లో ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. అందులో భాగంగా మహానందానికి నిలయమైన మహానందిలో శుక్రవారం ఆకాశదీపాన్ని దర్శించేందుకు కార్తీక చంద్రుడు కొలువయ్యాడు. నల్లటి ఆకాశంలో మిలమిలా మెరిసిపోతున్న నెలవంక చంద్రుడి కాంతులు తోడైన ఈ దృశ్యాలు భక్తులను కనువిందు చేశాయి.

చదువుతో పాటు ఆటలు అవసరమే

పాములపాడు: విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు అవసరమని ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బదిరున్నిసా అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాఠశాలలో స్టోరీ టెల్లింగ్, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, పరుగు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ప్రశాంతతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

నీటి లభ్యత ఉంటేనే పంటలు వేసుకోవాలి

కొత్తపల్లి: నీటి లభ్యత ఉంటేనే ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఏఓ మహేష్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట కాల్వలు, చెరువులలోని నీటికి మోటార్ల ద్వారా వాడకూడదన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలి

జూపాడుబంగ్లా: విద్యార్థుల్లో పఠనాసక్తి పెరిగేలా విద్యాబోధన చేపట్టాలని కొత్తపల్లి ఎంఈఓ-1, 2 శ్రీరాములు, ఇనయతుల్లా ఉపాధ్యాయులకు తెలిపారు. శుక్రవారం వారు మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తి చేశారా, లేదా అని ఆరా ప్రిన్సిపాల్ రమేష్‌ను ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

నందికొట్కూరు: ఆరోగ్యం, పరిశుభ్రతపై అమ్మాయిలకు అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాడాక్టర్ ఆర్ సునీత అన్నారు. శుక్రవారం కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యం, పరిశుభ్రత అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కర్ణాటక కేర్ కంపెనీ ప్రతినిధి నందినిమోడీ, డబ్ల్యూసీ కన్వీనర్ డాక్టర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

నందిపల్లెలో చోరీ

మహానంది: నందిపల్లె గ్రామంలో శుక్రవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన తెలుగు సరస్వతి పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి మూడు తులాల బంగారు, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలు ఇంటికి వచ్చిన తర్వాత చోరీ విషయాన్ని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. నంద్యాల-గాజులపల్లె మార్గంలోని హైవేపై సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి అనుమానితులను విచారిస్తున్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని కిషన్‌సింగ్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం ఏర్పాటు చేయనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రబీలో వరి సాగు చేయొద్దు

మహానంది: రబీ సీజన్‌లో వరి సాగు చేయొద్దని మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గాజులపల్లె, సీతారామాపురం, నందిపల్లె గ్రామాల్లో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు గంగ, కేసీ కెనాల్ ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని గ్రామాలకు నీరు వచ్చే అవకాశం లేదని సంబంధిత అధికారులు చెప్పారన్నారు. రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు మొక్కజొన్న, మినుము, కొర్రలు, అవాలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీజీపీ జేఈ రాజా సుబ్బారావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్, కండక్టర్లకు ప్రోత్సాహక బహుమతులు



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆత్మకూరు: ఆర్టీసీలో అత్యధికంగా డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండర్లకు శుక్రవారం స్థానిక డిపోలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మహేంద్రుడు మాట్లాడుతూ ప్రతి ఆర్టీసీ ఉద్యోగి సంస్థకు లాభం చేకూర్చేవిధంగా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం ఆర్టీసీలో పనిచేస్తూ అత్యధిక డీజిల్ పొదుపుచేసిన డ్రైవర్లు సి.శివారెడ్డి, ఎస్‌కే వలి, బీఎస్ నారాయణ, ఏఎం బాషా, పీఆర్సీ రెడ్డి, సీసీఎం రెడ్డిలకు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు సీహెచ్ఏకే మోహన్, బి.రూపవాణి, కె.నాగన్న, జీఎస్ ప్రతాప్, ఈఎస్ లక్ష్మి, ఎస్.షఫీఉల్లా, జి.రామలింగారెడ్డి, జీసీ నాగమ్మలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు.

మహాప్రాణదీపం..శివం!



మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో మహాదీపార్చన

మహానంది: కార్తీకమాసం ఆలయాల్లో శోభను సంతరించుకుంది. కార్తీకదీపాలు వెలిగిస్తూ భక్తులు భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో కొలువైన గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సహస్రదీపార్చన, మహాలింగార్చన పూజలు వైభవంగా జరిగాయి. వేలాది దీపాలను శివలింగాకారంలో అమర్చి మహాలింగార్చన పూజలు చేపట్టారు.

శ్రీశైలంలో నాగులచవితి వేడుకలు



నాగదేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: కార్తీకశుద్ధ చవితిని పురస్కరించుకుని శుక్రవారం పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద నాగదేవతలను పూజించారు. వేకువజాము నుంచి భక్తులు నాగులకట్ట వద్దకు చేరుకుని పత్తితో చేసిన వస్త్రం, యజ్ఞోపవీతం, పలురకాల పుష్పాలతో నాగమూర్తులను అలంకరించి పాలతో అభిషేకించారు. అనంతరం నువ్వుల పిండి, చలిమిడి, వడపప్పులను నివేదించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనను నిరసిస్తూ ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు స్వాములు, దాసు అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలో ఆటోజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంటలన్నింటికి సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి ఎంఎస్‌పీలను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించి ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలు, నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించాలని తదితర డిమాండ్లతో విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు అన్ని వర్గాలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు, వ్యవసాయ, కౌలు, సీఐటీయూ సంఘాల నాయకులు నరసింహనాయక్, సుధాకర్, మాబాషా, రామ్‌నాయక్, మహమ్మద్, సత్యనారాయణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

– నందికొట్కూరు: మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద ఈ నెల 27, 28న విజయవాడలో జరిగే మహాధర్నా వాల్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఫకీర్‌సాహెబ్, బాలయ్య, ఈశ్వరమ్మ, కర్ణ, వెంకటేశ్వర్లు, నాగన్న, నాగమణి, నరసింహులు, ఏసన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విక్షిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సంజయ్ కుమార్

నంద్యాల: ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ వరకు 60 రోజుల పాటు నిర్వహించే విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర ను విజయవంతం చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంకింగ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో యాత్ర నిర్వహణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ శామూన్ పాల్గొన్నారు. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాల ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 4 వాహనాల ద్వారా రోజుకు రెండు గ్రామాలు చొప్పున 489 గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందుకోసం 37 మంది జిల్లా అధికారులను కేటాయించి బాధ్యతలు అప్పగించామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● ఫ్యాక్టరీల్లో ప్రమాద నివారణ చర్యలు చేపట్టండి

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రమాదకర రసాయన ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీలలో తీసుకోవలసిన భద్రత ప్రమాణాలు, వ్యక్తిగత భద్రత పరికరాలు, భద్రత కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఫ్యాక్టరీని అత్యధిక తీవ్ర ప్రమాదకారక ఫ్యాక్టరీగా గుర్తించామన్నారు. ఫ్యాక్టరీల చట్టం కింద ఉన్న ఫ్యాక్టరీల వివరాలు, డిస్ట్రిక్ క్రైసిస్ గ్రూప్ విధుల గురించి విశదీకరించారు.

ధ్రువపత్రాల అందజేత

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 5 నెలలుగా స్కిల్‌హబ్‌లో నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ధ్రువపత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ పార్వతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ శిక్షణలో డేటా ఎంట్రీ, ఆపరేటర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఐటీ సేల్స్, టెలీకాలర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

24న ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ కాలనీ, త్యాగరాజ నగర్‌లో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజ స్వామి దేవస్థానంలో ఈ నెల 24వ తేదీన శ్రీ శివ పార్వతుల, పంచముఖి ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు తెలిపారు. సంఘ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన ఆలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. నంద్యాల జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, దీక్షా హోమం, 25న జపాదులు, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు కార్తీక వనభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ చూపిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని వివరించారు. వివరాలకు సెల్ 7013846031 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హెల్త్‌కార్డులతో ప్రయోజనం



యజమానులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న ఏడీ రామాంజనేయనాయక్

జూపాడుబంగ్లా: పశువులకు, జీవాలకు ప్రభుత్వం మంజూరుచేసిన హెల్త్‌కార్డుల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని పశుసంవర్ధక శాఖ ఏడీ రామాంజనేయ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పశువులు, జీవాల యజమానులకు హెల్త్‌కార్డుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హెల్త్‌కార్డుల వల్ల పశువులకు, జీవాలకు వైద్యం సులభమవుతుందన్నారు. టీకాలు వేసిన తేదీ, వ్యాధులకు చికిత్స, కృత్రిమ గర్భధారణ సూది వేసిన తేదీ, చూడినిర్ధారణ, దూడపుట్టిన తేదీ వంటివాటిని హెల్త్‌కార్డులో పశువుల వైద్యులు నమోదు చేస్తారన్నారు. అలాగే ఆ వివరాలను ఆన్‌లైన్ చేస్తారన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన పశువులకు బీమా వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పశువులకు హెల్త్‌కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, వైద్యసిబ్బంది సుధీర్, సుమన్, వెంకటేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.